"ఎందుకు నన్నిలా చిత్రవధ చేస్తారు. ఒక్కసారి... ఒక్కపెగ్గు.... మళ్ళీ ముట్టుకోను. మీమీద ఒట్టు ప్లీజ్" అంత గొప్పమనిషి అలా దిగజారిపోతూంటే జాలేసింది శాంతకి.


"మిస్టర్ రవీ! కంట్రోల్ యువర్ సెల్ఫ్."

"కంట్రోల్? వాట్ ఫర్? యూనో? నేనెవర్నో తెలుసా? తెలిసే అందరితోపాటూ ఈ మామూలు రూమ్‌లో నాకు ట్రీట్‌మెంట్ ఇస్తారా?" ఉక్రోషం, కోపం, అసహాయత ముప్పిరి గొనగా, కసిగా అడిగాడు.

"ఇక్కడుండే మామూలు మనుషులు చేసే పనీ, మీరు చేసేపనీ ఒకటే గనుక మిమ్మల్ని ఇక్కడుంచాల్సి వచ్చింది మిస్టర్ రవీ." 'మామూలు' అనే పదాన్ని మరింత ఒత్తి పలుకుతూ అంది శాంత.

పెరిగిన గడ్డం, ఎర్ర బారిన కళ్ళు. రెండ్రోజులుగా డ్రింక్ లేకుండా పోవటంతో బోనులో పెట్టిన సింహంలా వున్నాడతను. అతను రవిచంద్ర. బాహ్య ప్రపంచంలో పెద్ద సినిమా డైరెక్టర్. ఒకప్పుడు అతను సినిమా డైరెక్ట్ చెయ్యటానికి ఒప్పుకుంటే చాలు, ముందుగా ప్రొడ్యూసర్ సేఫ్ అయి పోయేవాడని, అతను చేసిన ప్రతి సినిమా ఓ పెద్ద హిట్ అని ప్రతీతి.

కీర్తి కాంత దారి చూపిస్తూంటే ఉన్నత శిఖరాలని అధిరోహించటం తెలిసిన చాలామంది గొప్ప వ్యక్తులకి, తమ తర్వాత తరం ముందుకు వచ్చినప్పుడు ఆ శిఖరాల నీడల్లోకి నిశ్శబ్దంగా జారిపోవటం తెలీదు. గెలుపూ ఓటములను సమంగా చూడటం తెలీదు. కానీ, అతని పతనానికి అదే కారణమనిపించలేదు శాంతకి. ఆ హాస్పటల్‌లో అలాంటి కేసులు కొన్ని వేలు చూసినా, ఎందుకో ఇంకా ఆమె గుండెలు కరుడు గట్టి బండబారలేదు. అలాంటి వాళ్ళకు చేయూత నిచ్చి మామూలు మనుషులని చెయ్యాలనే తపన అంతకంతకూ



# పరివర్తన

## శైల

ఎక్కువ అవుతోంది. తాగుడు, డ్రగ్స్ అనే వ్యసనాల బారిన పడి పతనమయ్యే వాళ్ళను ఆదుకుని, మళ్ళీ వాళ్ళను మామూలు మనుషులను చేసి, తిరిగి నాగరిక ప్రపంచంలో ఆ వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు వాళ్ళకు కావలసినంత ఆత్మస్థైర్యం కలిగించి, ఎందరో వ్యసనపరులకు మళ్ళీ అందమైన తమ జీవితాలకు అర్థం తెలుసుకుని హాయిగా, ఆనందంగా జీవితాన్ని అనుభవించటం నేర్పిన సంస్థ అది.

ఆ మహావృక్షం నాందికి విత్తనం శాంత అని చాలామందికి తెలియదు. ఆ సంస్థకి ఆమె వెన్నెముక. తాగుబోతు, పరమనికృష్టుడైన భర్త పెట్టే బాధలు పంటి బిగువున సహించిన శాంతను భర్త మరణం మరింత కృంగదీసింది. కారణం బ్రతకటం చేత కాకపోవటం, రెండోది సెల్ఫ్‌పిటి. జీవితంలో మాధుర్యం లేక, పరిస్థితులను ఎదు ర్కొనే ధైర్యంలేక ఆత్మహత్యకు పాల్పడితే, ఓ మహానుభావుడు రక్షించి జీవితమంటే ఏమిటో, దానికి పరమార్థమేమిటో తెలియచెప్పాడు. ఇంకా తనలాంటి అభాగ్యులకి, ఆ వ్యసనాల బారిన పడి పసి పిల్లలకంటే మొండిగా, మూర్ఖత్వంతో జీవితాన్ని నాశనం చేసుకునే వ్యసన పరులకి చేయూతనిచ్చి, వాళ్ళని మామూలు మనుషులని చెయ్యటానికి తనవంతు సహాయంగా తన జీవితాన్నే ఆ సంస్థకు అంకితం చేసింది శాంత.

ఒక తాగుబోతును గానీ, డ్రగ్సుకు అలవాటుపడిన వ్యక్తిని గానీ బాగు చెయ్యాలంటే ముందుగా అతని కుటుంబ సభ్యుల సహకారంఎంతైనా అవసరం. అందుకే శాంత 'మిసెస్ రవిచంద్ర'తో మాట్లాడ్డానికి నిర్ణయించుకొంది. వెయ్యిరూపాయలు ఖరీదు చేసే చీర, కాస్త మొరటుగా వున్నట్లనిపించే నగలు, వెనకాల ఇద్దరు పనివాళ్ళు, వెరసి కృష్ణవేణి, మిసెస్ రవిచంద్ర. శాంతకి ఆమెలో అహంకారం కంటే అమాయకత్వమే ఎక్కువగా కనిపించింది.

"చూడండి కృష్ణవేణీ! ప్రతి తాగుబోతుకీ తన బలహీనత తెలుసు. దాన్ని సమర్థించుకోవటానికి తనవైపు నుండి బలమైన వాదన నిర్మించుకుంటాడు. తన మూర్ఖపువాదనతో తన చుట్టూ బలమైన కోట నిర్మించుకుంటాడు. లేని కష్టాల్ని ఊహించుకుని బాధపడి, తన చుట్టూవున్న వాళ్ళని బాధపెడతాడు.

ఇలాంటి వాళ్ళని బాగు పరచాలంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతయినా అవసరం. ముందుగా ఆయన గురించి వివరాలు కావాలి" అంది.

"ఆయన్ని ప్రేమించి పెళ్ళి చేస్కున్నాను. ఆ తర్వాత తెలిసింది అయనకు నేనంటే ఇష్టం లేదని. ఈ విషయం ముందే తెలిస్తే ఈ పెళ్ళికి ఛస్తే ఒప్పుకునే దాన్ని కాదు. ఆయన్ని ఏనాడూ ఓ గొప్ప డైరెక్టరుగా భావించి ఇష్టపడలేదు. మా నాన్నగారు అయనతో ఓ సినిమా తీశారు. డిస్కషన్సు కోసం తరచూ మా ఇంటికి వచ్చేవారు. కలుపుగోలుగా వుండే అతని మెంటాలిటీ నాకు నచ్చింది. నాన్నగారితో చెప్పాను. నేనంటే ఇష్టం లేకపోయినా వెనకాల నా ఆస్తి చూసి నన్ను పెళ్ళి చేస్కున్నారు. ఆ మాటంటే ఆయనకు కోపం."

"మీరలా సూటిగా అనకూడదు కృష్ణవేణీ!"

"ఎందుకని? నువ్వంటే నాకిష్టంలేదని నా మొహాన్నే అంటూంటే, నేనలా అనటంలో తప్పేముంది?" కళ్ళల్లో నీళ్ళు శాంతకి కనబడకుండా తల తిప్పేస్తూఅంది కృష్ణవేణి. కానీ ఇప్పుడు భార్యగా ఆమె చేయూత ఎంతో అవసరం అతనికి. ఆ మాటే అంది కృష్ణవేణితో.

"నేనెందుకండీ! అన్నపూర్ణ వుందిగా. ఆవిడ చెప్తేచాలు. ఆయన మామూలు మనిషవుతారు." ఆ మాటల్లో ఉక్రోషం తొంగి చూసింది.


"కృష్ణవేణిగారూ! మనకిప్పుడు రవిచంద్ర గారు బాగుపడటం ముఖ్యం. దానికి ఎవరి సహాయమైనా తీస్కోవల్సిందే. అసలు ఈ 'అన్నపూర్ణ' ఎవరండీ?" ఆ అడగటంలో కుతూహలం కంటే కూడా, రవిచంద్ర బాగుపడటానికి ఆవిడ ఎంత వరకు సహకరించగలదూ అనే ఆశే ఎక్కువగా వుంది.

• • •

ఎక్కువగా చదువుకోని, అమాయకత్వం మూర్తీభవించే పద్దెనిమిదేళ్ళ కృష్ణవేణికి తండ్రి గారాబం, బోలెడంత ఆస్తి, కాస్తో కూస్తో అందం వుండటంతో ఎనలేని మూర్ఖత్వం కూడా అబ్బింది. కానీ రవిచంద్రంటే విపరీతమైన ఇష్టం. అన్నపూర్ణ, రవిచంద్ర ఆడిటర్ ప్రకాశరావు భార్య. అందగత్తె. చెప్పాలంటే తెలివైన అందగత్తె. భార్యగా తన స్థానానికి ఎటువంటి ప్రమాదం రానంత కాలం ఎదుటి వాళ్ళని తన అందంతో ఆకర్షణతో రెచ్చగొట్టి, తన చుట్టూ తిప్పుకుని అహాన్ని తృప్తిపరచుకుంటుంది. విషయం శృతి మించేట్లు కనబడగానే, చాలా కన్వీనియంట్‌గా తన భర్తకు అన్యాయం చేయలేనట్లు, గౌరవం అనే పరదాల చాటుకు వెళ్ళిపోతుంది. తనతో ఎక్కువ టైమ్ స్పేర్ చెయ్యలేని భర్త, బోలెడంత తీరిక. అలాంటి సమయంలో ఓ టైమ్ పాస్‌గా రవిచంద్ర దొరికాడు. అందులోనూ సినిమా డైరెక్టర్. వారి పరిచయం స్నేహం పరిధులు దాటి ఆకర్షణలోకి దిగే సమయానికి కృష్ణవేణీ తండ్రి తన కూతుర్ని పెళ్ళి చేసుకోమని రవిచంద్రను అడిగాడు. ఇటు అన్నపూర్ణ, అటు మంచి ప్రొడ్యూసర్. ఎటూ తేలని సమస్య. ఈ పెళ్ళి తమ స్నేహానికి (?) ఏమాత్రం అడ్డురాదని తానెప్పుడూ అతని పక్కనే వుంటానని మాటిచ్చి దగ్గరుండి మరీ వాళ్ల పెళ్ళి జరిపించింది అన్నపూర్ణ. కానీ స్వతహాగా అందం, మంచి టేస్ట్ వున్న అన్నపూర్ణని కృష్ణవేణితో కంపేర్ చేస్కుని తానేదో పోగొట్టుకున్నానని, కృష్ణవేణి తనని అర్థం చేస్కోదని బాధపడసాగాడు రవిచంద్ర. ఓదార్పుకెలాగూ అన్నపూర్ణ వుంది. విషయమంతా గ్రహించటానికి కృష్ణవేణికి ఎక్కువ రోజులు పట్టలేదు. అర్థం చేసుకుని చక్కదిద్దుకునే తెలివితేటలులేని అమె మూర్ఖత్వంతో, మొండితనంతో అతన్ని రెచ్చగొట్టి అతనికి మరింత దూరమవసాగింది. ఆవేశంలో ఒక రోజు ప్రకాశరావుకి ఫోన్ చేసి ఈ గొడవంతా బయట పెట్టి నానాయాగీ చేసింది. నిలదీసిన భర్తకు తనకేం తెలీదని రవిచంద్రముందే కళ్ళనీళ్ళు పెట్టుకుంది అన్నపూర్ణ. అదిగో అక్కడి నుండి మనుషులపై కసి, అదే సమయంలో డైరెక్టర్‌గా అపజయాలూ. ఇవన్నీ అతణ్ణి ఈ వ్యసనంలోకి తోశాయి.

• • •

సాంతం విని, "కృష్ణవేణి గారూ! ప్రతి మగవాడికి ఒక 'ఐడియల్ షి' వుంటుంది. జీవితంలో అలాంటి వ్యక్తులు వీళ్ళకు దొరకరు. అలా దొరకకుండా వుండాలనే వాళ్ళ ఆశ కూడా. ఆ బాధ నుండి వాళ్ళు స్ఫూర్తిని పొందుతారు. ఆర్టిస్టు అనే వాడికి



పట్టుచీరల్ని - పొరబాటున కూడా వాషింగ్ మెషిన్‌లో ఉతక కూడదు.

ఖాళీ అయిన గ్లాసులో నీళ్ళు నింపినట్లు 'ఇన్స్పిరేషన్' అనేది నిరంతరం కావాలి. తన భార్యని 'ఐడియల్ షి'తో పోల్చుకుని బాధపడతాడు. భార్యలోని లోపాలు తర్వగా బయటపడతాయి. ప్రియురాలి విషయంలో ఆ ఛాన్సే లేదుగా? ఈ విషయం గమనించి, కాస్త మీ అహాన్ని పక్కకి నెట్టి నాతో సహకరిస్తే మీరు రవిచంద్రని గెల్చుకోవటం ఖాయం. అతనికెలా ఇష్టమో అలా వుండండి, మీరతన్ని కావాలనుకుంటున్నారు. కాబట్టి ఇందులో మీ వ్యక్తిత్వం దెబ్బతినే ప్రసక్తేలేదు. దెబ్బతినున్న అతనికి మీరిప్పుడు దగ్గర కావటం చాలా సులభం. అతనంటే మీకెంత ఇష్టమో సూటిగా చెప్పండి. కాకపోతే ముందుగా అతను మా ట్రీట్‌మెంట్ తీస్కునేలా చూడాలి. ఆ సంగతి నేను చూస్కుంటాను" అంది శాంత.

• • •

"మిస్టర్ రవిచంద్రా! ఇవాళ గ్రూప్ థెరపీకి ఎందుకు రాలేదు" కరకుగా అడిగింది శాంత. గ్రూప్ థెరపీలో హాస్పటల్ ద్వారా బాగుపడిన ఒక వ్యక్తి తన అనుభవాలను అక్కడి పేషెంట్స్‌కు వివరిస్తాడు. అలాగే ప్రతి పేషెంట్ తన అనుభవాలను ఇతరులతో పంచుకోవాలి. దీనివల్ల తామొక్కరే ఈ వ్యసనానికి బానిసలు కామని, తమది నయం కాని భయంకరమైనఅలవాటు కాదని పేషెంట్‌కి ధైర్యం వస్తుంది.

"చూడండి శాంతా! నాది హెూప్‌లెస్ కేస్. నన్ను వదిలెయ్యండి. మీ హాస్పిటల్‌కు ఎంత డొనేషన్ కావాలో చెప్పండి ఇస్తాను" ఎగతాళిగా అన్నాడు అతను.

"అలాగా? నేనెంత అడిగినా ఇస్తారా?"

"అఫ్‌కోర్స్, మరీ లక్షల్లో అయితే చెప్పలేను గానీ, కాస్త రీజనబుల్‌గా అయితే ఓ.కె."

"డబ్బు రూపేణా కాకుండా మరేదయినా పర్వాలేదా?" నవ్వుతూ అడిగింది.

"నా అలవాటు గురించి తప్పితే మరేదయినా పర్వాలేదు.

"అయితే జస్ట్ వారం రోజులు మా హాస్పటల్లో మేం చెప్పినట్లు వుండండి. ఆ తర్వాత మీ ఇష్టం. మీరు వెళ్ళిపోవచ్చు. ఒక రకంగా మీకిది ఛాలెంజ్ అనుకోండి మీకా విల్ పవర్ లేకపోతే ఒద్దనుకోండి" టీజ్ చేస్తూ అంది శాంత.

తనని ఆవిడ ట్రాప్ చేసే విధానానికి నవ్వొచ్చింది రవిచంద్రకి.

"ఓ.కె. ఐ విల్ స్పేర్ యు ఒన్ వీక్."

"థాంక్యూ.. బైదిబై మీరీ మధ్య ఎక్కువగా సినిమాలు తీయకపోవటానికి కారణమేమిటి?" కుర్చీ అతనికెదురుగా లాక్కుని కూర్చుంటూ అడిగింది.

"నేను ట్రెండ్ మార్చలేనండీ. ప్రేక్షకులకు రోజుకో కొత్త రుచికావాలి. డైరెక్టరుగా నా పొజిషను సేఫ్ చేస్కోవాలంటే నా పంథా మార్చుకోవాలి. అది నావల్లకాదు." అతని మాటల్లో 'కసి' తొంగి చూసినా, అతనిలోని సిన్సియారిటి అమెకు నచ్చింది.

"మీ సినిమాలు సక్సెస్ కాకపోవటానికి ట్రెండ్ ఒకటే కారణం కాకపోవచ్చు. ప్రతి సినిమాసబ్జక్ట్ అంతర్గతంగా ఒకటే అవటం కూడా కావచ్చు. మీ చుట్టూ జరిగే సంఘటనలను గమనించండి. ఏదో ఒక చిన్న 'త్రెడ్' దొరక్కపోదు. వాస్తవానికి కాస్త కల్పన జోడించండి. ఈ హాస్పిటల్ తీస్కోండి. రకరకాల పేషెంట్స్. ఒక్కొక్కరి జీవితం ఒక్కోకథ. అఫ్‌కోర్స్ సినిమా నిర్మాణం గురించి నాకు పెద్దగా తెలీదనుకోండి. నా వరకు నాకు సినిమాలు మామూలు జీవితానికి దగ్గరగా హృదయానికి హత్తుకునేలా వుంటేనే ఇష్టం."

ఒక్క క్షణం 'స్టన్' అయ్యాడు. ఇంతవరకూ తన సినిమాలను ఇలా 'ఎనలైజ్' చేసి చెప్పిన వారు లేరు. కానీ అమె చెప్పింది "నిజం" అని ఒప్పుకోవటానికి అతని 'ఈగో' రాజీ పడట్లేదు.

అలా రోజూ అతనికిష్టమైన సబ్జక్ట్ మీద ఓ అరగంట మాట్లాడుకునే వారు. అతను హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ తీస్కోవటం మొదలుపెట్టి రెండ్రోజులయింది. కబుర్లలో ఓ రోజు హఠాత్తుగా,

"అవునూ, అన్నపూర్ణ మీకు ఫోన్ చేశారా?" అంది రవిచంద్రతో. తనూహించినట్లు అతనేమీ కంగారు పడలేదు.

"లేదు. బహుశా తనకి నేనిక్కడ వున్నట్లు తెలీదనుకుంటాను" కిటికీలో నుండి కనిపించే

ఆకాశాన్ని చూస్తూ అన్నాడు. అదీ గొప్ప ఆత్మ వంచన అని ఆ యిద్దరికీ తెలుసు.

"ఆవిడ మీకు చాలా క్లోజ్ అనుకుంటాను."

"కృష్ణవేణి చెప్పిందా?" సూటిగా అడిగాడు.

"లేదు. మీరు 'సెడెషన్'లో వున్నప్పుడు చాలాసార్లు ఆవిడ పేరు కలవరించారు. అందుకని నా అంతట నేనే అడిగాను."

"దయచేసి ఆ ఒక్క విషయం మాత్రం అడక్కండి" ఎటో చూస్తూ అన్నాడు.

"ఐయామ్ సారీ!" టాపిక్ మారుస్తూ "కృష్ణ వేణి గారేంటి నిన్న రాలేదు. ఆవిడ చాలా సరదాగా వుంటారేం. ఆవిడ రాకపోతే ఏవిటో బోసిగా వుంది" ఆరాగా చూస్తూ అంది శాంత.

"తనకంత తీరికుంటుందా? షాపింగ్‌లూ, డిన్నర్‌లూ వీటితోనే సరిపోతుంది. నా గురించి పట్టించుకోటానికి టైమెక్కడ వుంటుంది?" వంకరగా నవ్వుతూ అన్నాడు.

"ఆవిడ గురించి మీరెంత టైమ్ స్పేర్ చేశారు రవిచంద్రా?" డైరెక్ట్‌గా సబ్జెక్ట్‌లోకి వస్తూ అడిగింది.

"ఆవిడెంత లోన్లీగా ఫీలవుతున్నారో మీరెప్పుడన్నా ఆలోచించారా? మీ భార్యగా ఆవిడకో స్టేటస్ వుందేమోగానీ, మీ మనసులో ఆవిడ స్థానమేమిటి? 'అన్నపూర్ణ' పాటి చెయ్యదా ఆవిడ" సూటిగా అంది శాంత.

"అన్నపూర్ణకీ, తనకీ పోలిక తేకండి శాంతా. డబ్బుందనే అహంకారం విపరీతంగా వున్న కృష్ణవేణికీ, అన్నపూర్ణకీ పోలికెక్కడ."

"మరి మీ అన్నపూర్ణ మీకు కనీసం ఫోనైనా చెయ్యలేదేం?". దానికి అతని దగ్గర సమాధానం లేదు.

"మీకు తెలుసా. నేనూ, కృష్ణవేణిగారూ ఆవిడ్ని కాంటాక్టు చెయ్యటానికి శాయశక్తులా ప్రయత్నించాం. ఆవిడ చెప్తేనన్నా మీరు బాగుపడతారని పిచ్చి ఆశ కృష్ణవేణిగారిది. అయినా అన్నపూర్ణగారు మాకు దొరకలేదు. మీరిలా వున్నారని ఆవిడకు తెలీదనుకుంటున్నారా రవిచంద్రా? ఏ స్త్రీ భార్యగా తన స్థానాన్ని ఒదులుకోవటానికి ఇష్టపడదు. అన్నపూర్ణ కూడా ప్రమాదం జరక్క ముందే తెలివిగా మీ నాటకానికి తెరదించేసింది. ఇక్కడ ప్రేమకు ఆస్కారం లేదు. ఆవిడకు అది జస్ట్ 'ఫన్'. రేపు ఇంకొకరెవరయినా దొరక్కపోరు. ఇక మీరన్నట్లు కృష్ణవేణి గారి సంగతంటారా? ఆవిడకు డబ్బుందనే అహంకారం ఉండవచ్చు. నిజంగా ఆ డబ్బు మీకే రకంగానూ ఉపయోగపడ లేదంటారా?"

"కావచ్చు. అలా అని ప్రతిదానికీ తన అధికారం నా మీద చూపాలని చూస్తే నేను భరించలేను."

"రవి గారూ! ఏ విధంగానూ మీకు దగ్గర కాలేక, కనీసం ఆర్థికంగానైనా మీరు తన మీద ఆధారపడితే, మీరు తనవారని చెప్పుకునే కృష్ణవేణి గార్లో మీరంటే ప్రాణమిచ్చే మనసుంది" బాధగా అంది శాంత.

"ఉండొచ్చు. కాని నాకెలా కావాలో అలా నడుచుకునే గుణంలేదు" ఆ మాటతో శాంతలో తెలీని ఆవేశం రేగింది.

"మీరేనాడన్నా "నువ్విలావుంటే నాకు ఇష్టం" అని చెప్పారా? ఆలోచించండి. గొప్ప కళాకారులు మీరు. మీకేదో దొరకలేదనీ, మిమ్మల్నెవరూ అర్థం చేస్కోరనే బాధతో మీరు వేరే మార్గాలు తొక్కి స్వాంతన పొందుతున్నారే. మీకు దగ్గర కాలేకా, ఒంటరితనంతో చేతినిండా డబ్బుతో, చుట్టూ అడ్వాంటేజ్ తీస్కునే మనుషులతో నిండివున్నప్పుడు ఆవిడలా ప్రవర్తించటంలో తప్పేముంది? మీకు డ్రింక్ చేస్తే కలిగే రిలాక్సేషన్ ఆవిడకు షాపింగ్ చేస్తే కలుగుతుందేమో? సారీ, మరీ చనువు తీస్కుంటున్నాననుకోక పోతే ఒక్కసారి ఆవిడకు అవకాశం ఇవ్వండి. మీ మధ్య ఆ కమ్యూనికేషన్ గాప్‌ని చెరిపేయండి. మీ ఆరోగ్యం పట్ల అందరూ ఆందోళన చూపిస్తున్నారే గానీ, ఫ్రస్ట్రేషన్‌లో ఇలాగే వుంటే ఆవిడకు జీవితం మీద విసుగేసి ఏ అఘాయిత్యానికైనా తలపడవచ్చు. కనీసం భర్తగా మీ బాధ్యత నిర్వర్తిస్తే చాలు. కృష్ణవేణిగారిని మంచి ఇల్లాలుగా మార్చవచ్చు. ఆలోచించండి" అని అంటూండగానే-

"నమస్తే మేడమ్" అంటూ కృష్ణవేణి లోపలికొచ్చింది. గోధుమ రంగుకు చిన్న ఎర్రంచు బోర్డరు వున్న చీర, చేతిలో పూలు.



వడలిపోయినట్లుండే కొత్తిమీరను గోరు వెచ్చని నీటిలో వేసి కాసేపలా ఉంచండి. ఫ్రెష్‌గా తయా రవుతుంది.

"ఎవరూ? నిజంగా కృష్ణవేణే?" ఆశ్చర్యపోయాడు రవిచంద్ర.

"శాంతగారూ! మావారికి డైట్ రిస్ట్రిక్షన్ ఏమీ లేదుగా? ఎందుకంటే కాస్త ఉప్పు-కారాలు ఎక్కువే కావాలి ఆయనకు" అగరువత్తులు వెలిగిస్తూ అంది కృష్ణవేణి.

"సారీ, ఇక్కడున్నన్ని రోజులూ మేమే అన్ని ఏర్పాట్లూ చేస్తాము. తప్పదు మరి."

నవ్వుతూ శెలవు తీస్కుంది శాంత.

తను తెచ్చిన పూలు, గాజు గ్లాసులో నీళ్లు పోసి అందులో పెట్టి, కుర్చీ అతని మంచానికి పక్కగా లాక్కుని కూర్చుంటూ "బాగా బోర్ కొడుతూందా? ఈ రోజు నుంచీ నేను ఇక్కడే మీతో వుంటాను. బోల్డు పుసక్తాలు తెచ్చాను. ఆ అన్నట్టు రామచంద్ర గారు మీ కోసం ఫోన్‌చేశారు. మీతో సినిమా తియ్యాలట. మీరు ఊళ్ళో లేరని చెప్పి ఓ పదిహేను రోజులాగి ఫోన్ చెయ్యమన్నాను. నాన్నగారు ఊటీ వెళ్ళారు. నన్నూ రమ్మన్నారు. నేను రానన్నాను. కోపమొచ్చి వెళ్ళిపోయారు. ఒక్కత్తినే ఒంటరిగా ఇంట్లో ఎందుకని ఇక్కడికి వచ్చేశాను" అంటూ సడన్‌గా భోరుమని ఏడ్చేసింది. ఊహించని ఈ పరిణామానికి తెల్లబోయి గబుక్కున కృష్ణవేణి భుజాలు పట్టుకుని

"ఏవిటిది వేణీ! ఎందుకు" అని అతడు అంటూండగానే,

"మీరు నాకు దూరమయితే భరించలేనండీ. నేనుపెరిగిన వాతావరణం వల్ల నాకు కాస్త అహంకార మెక్కువే. దానివల్ల నేనేం పోగొట్టుకున్నానో తెలిసింది. మీకూ నాకూ మధ్య ఎవరయినా వస్తే భరించలేక పోయేదాన్ని. అది కసిగా మారి నన్ను హింసించుకుని, మిమ్మల్నీ బాధ పెట్టాను. నాకు ఒక్క అవకాశమివ్వండి. మీ భార్యగా మీ మనసులో కాస్త చోటివ్వండి" అంది బేలగా, కళ్ళనిండా నీళ్ళతో.

తన ఎదురుగా వున్న కృష్ణవేణిలో మొట్టమొదటి సారిగా 'అర్థాంగి'ని చూడగలిగాడు రవిచంద్ర. వారిద్దరి మధ్య వున్న మౌనమనే మంచు పర్వతం మనసులో నుంచి వచ్చిన అప్యాయతతో కూడిన కిరణాల్లాంటి మాటలకు కరగసాగింది. ఆ భార్యా భర్తల మధ్య అంతవరకు కమ్ముకున్న పొర తొలగి జీవితంలో మొదటిసారిగా ఒకరంటే ఒకరు ఏమిటో తెలుసుకున్నారు. డిశ్చార్జి అయ్యే రోజు కృష్ణవేణి కళ్ళనిండా నీళ్ళతో చేతులు జోడించి

"మీకు నేనెంతో రుణపడి వున్నాను. మిమ్మల్ని 'అక్కా' అని పిలవచ్చా" అని అనగానే శాంతకు అప్రయత్నంగా కళ్ళనీళ్ళు తిరిగాయి

"ఛా! ఏవిటిది? శుభమా అని ఇంటికి వెళుతూ కన్నీళ్ళు పెట్టుకుంటారా?" అంటూ అక్కున చేర్చుకుంది.

రవిచంద్ర శాంతకు "థాంక్స్" చెబుతూ "శాంతగారూ! అనుభవాల్ని మెట్లుగా చేస్కుని పైకి ఎక్కాలి గానీ, పాకుడు రాళ్ళుగా చేసుకుని పాతాళానికి జారకూడదని మీనుంచి తెలుసుకున్నాను. ఈ పదిహేను రోజులూ నా జీవితానికి కావలసినంత పునాదిని వేశాయి. ఈ వాతావరణాన్ని, ముఖ్యంగా మిమ్మల్నీ వదిలి వెళ్ళాలంటే దిగులుగా వుంది. కానీ తప్పదుగా" అన్నాడు.

"రవిచంద్రగారూ! కళాకారుడికే కాదు. ప్రతి మనిషికీ జీవితంలో అప్పుడప్పుడు కొన్ని అనుభవాలు కావాలి. లేకపోతే జీవితం నిస్సార మవుతుంది. నిజానికి ప్రతి మనిషీ ఎదుటి వ్యక్తి కంటే కూడా 'ప్రేమ' అనే భావాన్ని ప్రేమిస్తాడు. అందరూ నిజంగా తమతోటి వ్యక్తిని ప్రేమించగలిగితే ఈ ప్రపంచంలో ఇన్ని అరాచకాలు జరగవు. అనుభవాలనేవి తలచుకున్నప్పుడు హాయిగా, పెదవుల మీద చెరిగిపోని చిరునవ్వును మిగల్చాలి గానీ, చిక్కుపడిన దారాల్లా జీవితాలను చుట్టుకుని బాధపెట్టకూడదు. ప్రతి పరిచయంలోనూ ఓ మంచి ఆరోగ్యకరమయిన అనుభవాన్ని మిగుల్చుకోండి. మీరింకా కీర్తిశిఖరాలను అధిరోహించాలనీ, మీ దంపతులు చల్లగా ప్రశాంతమైన జీవితం గడపాలని ఆశిస్తున్నాను" అంది నిండు మనసుతో శాంత.